సాక్షి వికారాబాద్

మంగళవారం । 8 । జూలై । 2025



అధ్వాన రోడ్డు..

గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికి రహదారులన్నీ గుంతలమయమయ్యాయి. 8లో▸



కరెంటు సమస్య తీర్చండి

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, మోటార్లు పనిచేయకపోవడంతో రైతులు సోమవారం స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 8లో▸



వ్యాధుల కాలం..జర పైలం!

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. 9లో▸

న్యూస్‌రీల్

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో ఇటీవల కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారములు, గనుల శాఖ మంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. సోమవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు స్పీకర్ పర్యటన

మర్పల్లి: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం మర్పల్లికి విచ్చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

రేపు జాబ్ మేళా

అనంతగిరి: టీంలీస్ సర్వీసెస్ లిమిటెడ్ (డి–మార్ట్ కోసం)లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సుభాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు బుధవారం ఉదయం 10.30గంటలకు వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు హాజరవ్వాలన్నారు. వివరాలకు 96760 47444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

హౌసింగ్ డీఈఈ బదిలీ



ఖలీమొద్దీన్

తాండూరు రూరల్: తాండూరు డివిజన్ హౌసింగ్ డీఈఈ ఖలీమొద్దీన్‌ను కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ సోమవారం హౌసింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తొమ్మిది నెలల క్రితం తాండూరుకు వచ్చిన ఆయన నియోజకవర్గంలోని పెద్దేముల్, తాండూరు, యాలాల, బషీరాబాద్ మండల పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిలో తనదైన ముద్రవేశారు. ఆయన సేవలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖలీమొద్దీన్ స్థానంలో కొడంగల్ డీఈ ఎం.చందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరిగి తహసీల్దార్‌గా వెంకటేశ్వరి

పరిగి: పరిగి తహసీల్దార్‌గా వెంకటేశ్వరిని నియమిస్తూ సోమవారం రెవెన్యూ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌రావు అక్రమంగా భూ రిజిస్ట్రేషన్ చేశారని ప్రజా సంఘాల నాయకులు నిరసనలు తెలపడంతో ఉన్నతాధికారులు ఆయన్ను ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం డి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరిని పరిగి తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

13న కేపీఎన్‌పీఎస్ రాష్ట్ర మహాసభలు

జిల్లా కన్వీనర్ వెంకటయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ వెంకటయ్య పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం తాండూరులో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. 'వైరుధ్యాల జీవనం, నయా ఉదారవాద భారత దేశంలో ప్రజలస్వామ్యం, అభివృద్ధి, సామాజిక న్యాయం'అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు ప్రసంగిస్తారన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అసమానతలను రూపుమాపేందుకు కేపీఎన్‌పీఎస్ పోరాడుతుందన్నారు. వర్గీకరణలో ఎస్సీ ఉపకులాల వైపు నిలబడడంతో పాటు, రాజ్యాంగ విరుద్ధ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఈ పోరాటానికి మద్దతు ఇస్తూ ఐక్యతను చాటేందుకు మహాసభలకు ప్రతీ ఒక్కరు తప్పకుండా హాజరు కావాలని కోరారు. సమితి జిల్లా కో కన్వీనర్ కిష్టప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు టి.నరేశ్, ఎం.వెంకటయ్య, ఎం.శ్రీను పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

డీహెచ్‌కు సెలవు!

తాండూరు జిల్లా ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా మార్చేందుకు సన్నాహాలు

- త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు?
- తాండూరు నర్సింగ్ కళాశాల భవనంలో కొడంగల్ మెడికల్ కాలేజీ
- ఇప్పటికే వర్చువల్‌గా పరిశీలించిన కేంద్ర బృందం



తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

తాండూరు: తాండూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి ఇక జనరల్ ఆస్పత్రిగా మారనుంది. ఇందుకు అధికార యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. నేడో.. రేపో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తున్నారు. 23 ఏళ్లుగా తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో సేవలందించిన ఈ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఏ) ఆధీనంలోకి వెళ్లనుంది. వీవీపీ వైద్యులు, సిబ్బంది రానున్న రోజుల్లో ఇతర ఆస్పత్రులకు వెళ్లే అవకాశాలున్నాయి. జనరల్ ఆసుపత్రిగా మారితే వైద్య సేవలు సక్రమంగా అందుతాయా లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

200 పడకలకు అప్‌గ్రేడ్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించిన తాండూరులో ఉమ్మడి జిల్లా ప్రభుత్వాస్పత్రి ఏర్పాటుకు అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో 2002 ఆగస్టు 1న తాండూరులో జిల్లా ప్రభుత్వాస్పత్రి ప్రారంభించారు. వంద పడకలతో ప్రారంభించి రోగుల సంఖ్య పెరగడంతో 200 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ ప్రతీ రోజు 800 వరకు ఓపీతో పాటు 180 మంది వరకు ఇన్‌పేషెంట్‌లకు వైద్య సేవలు అందుతున్నాయి.

బోర్డులు మార్చి అనుమతులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొడంగల్ నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కొడంగల్ పట్టణ శివారులో కాలేజీ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కళాశాల ఏర్పాటుకు 250 పడకల ప్రభుత్వ ఆస్పత్రి తప్పనిసరి. కానీ కొడంగల్‌లో పీహెచ్‌సీ మాత్రమే ఉండడంతో అనుమతులు సాధ్యపడలేదు. దీంతో తాండూరు జిల్లా ఆస్పత్రి బోర్డు తొలగించి కొడంగల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా బోర్డులు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ప్రతిపక్షాలు బోర్డులు తొలగించి నిరసన వ్యక్తం చేశాయి.

చురుగ్గా భవన నిర్మాణ పనులు

తాండూరు శివారులో నర్సింగ్ కళాశాల భవనంలోనే కొడంగల్ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి కొన్నాళ్ల పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక్కడ ఏర్పాటు చేస్తే జిల్లా ఆస్పత్రితో పాటు, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో 350 పడకలు అందుబాటులో ఉంటాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి సులువుగా మెడికల్ కళాశాల అనుమతులు తీసుకురావొచ్చనే యోచనతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. నాలుగు రోజుల క్రితమే కేంద్ర బృందం మెడికల్ కళాశాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను వర్చువల్‌గా పరిశీలించింది.

టీవీవీపీ ఉద్యోగుల్లో ఆందోళన

ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఇతర జిల్లాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు సమయంలో టీవీవీపీ ఆధీనంలో పని చేసిన వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో ఇక్కడ సైతం బదిలీలు తప్పవనే ఆందోళనలో ఉద్యోగులున్నారు. ఇక్కడి ఉద్యోగులను డీఎంఏ పరిధిలోకి విలీనం చేసి వైద్య సేవలను పొందాలనే డిమాండ్ సైతం పెరుగుతోంది. లేదా జిల్లా ప్రభుత్వ, జనరల్ ఆసుపత్రిలో నియమించే ఉద్యోగులను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.



మెడికల్ కళాశాల ఏర్పాటుకు సిద్ధమైన నర్సింగ్ కళాశాల భవనం

అదనపు వైద్య సేవలు



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ఎంసీహెచ్‌లు డీఎంఏలోకి మారనున్నాయి. మరో వారం రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయితే అదనపు వైద్య సేవలు అందుతాయి. రెండు ఆస్పత్రుల్లో 200 మంది వైద్యుల సేవలు అవసరం ఉంటుంది.

– డాక్టర్ ఆనంద్, డీసీహెచ్‌ఎస్, వికారాబాద్

రుణ ప్రణాళిక ఖరారు

- ఏటా పరిమితి పెంపు
- లక్ష్యం చేరుకోవడంలో విఫలం
- గతేడాది 60 శాతానికే పరిమితం
- తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్న రైతులు
- ఈ ఏడాది రుణ లక్ష్యం రూ. 8,525 కోట్లు



ఎస్‌బీఐ వికారాబాద్ శాఖ

వికారాబాద్: ఎట్టకేలకు బ్యాంకర్లు రెండు రోజుల క్రితం రుణ ప్రణాళిక విడుదల చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, పరిశ్రమలు, మహిళా స్వయం సహాయక సంఘాలు తదితర రంగాలకు ఆయా రంగాల ప్రాధాన్యత మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంత రుణం ఇవ్వాలనే ప్రణాళికను కలెక్టర్‌కు నివేదించారు. గతేడాది పెట్టుకున్న లక్ష్యాలతో పాటు అందులో ఏయే రంగంలో ఎంతెంత రుణం ఇచ్చారనే విషయాలపై చర్చించారు. గత లక్ష్యాలను చేరుకోవటంలో విఫలమైన బ్యాంకర్లు మళ్లీ అంతకు మించి లక్ష్యాలను సిద్ధం చేశారు. గతేడాదికి సంబంధించి 60 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరుకున్నారు.

లక్ష్యం చేరుకోవడంలో నిర్లక్ష్యం

గృహ, వాహన, వ్యక్తిగత రుణాలను లక్ష్యానికి మించి అందజేస్తున్న బ్యాంకర్లు పంట రుణాల విషయంలో మాత్రం విఫలమవుతున్నారు. జిల్లాలో 3.12 లక్షల మంది రైతులుండగా వీరిలో 1,86,107 మందికి ఆయా బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. గతేడాది ఈ ఖాతాదారులకు రూ.3,547 కోట్లు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. వానాకాలం, యాసంగి సీజన్‌లు కలుపుకొని రూ.2,014 కోట్లు అనగా 60 శాతంలోపే రుణాలిచ్చారు. దీర్ఘ కాలిక రుణాల్లో మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

2025–26గాను రూ.8,525 కోట్ల లక్ష్యం

వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఇతర రంగాలను కలుపుకొని 2025–26 ఆర్థిక సంవత్సరానికి 2,69,593 మంది ఖాతాదారులకు రూ.8,525 కోట్లు రుణాలివ్వాలని బ్యాంకర్లు లక్ష్యం పెట్టుకున్నారు. పంటరుణాలు రూ.2582 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రుణాలు (వానాకాలం, యాసంగి) రూ.3,547 కోట్లు , సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఔత్సాహికులకు రూ.608 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.1,190 కోట్లు, అప్రదాన్యతా రంగాలకు చెందిన రూ.1,092 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు అందాయని.. వాటిని పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

ఎనికేపల్లిలో ఉద్రిక్తత

- గోశాల పనులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య భూమిపూజ
- పరిహారం తేల్చకుండా ఎలా చేస్తారని చుట్టుముట్టిన రైతులు
- పనులు చేపట్టేందుకు వెళ్లిన జేసీబీని అడ్డుకున్న వైనం
- లాఠీలకు పనిచెప్పిన పోలీసులు.. ఇద్దరికి స్వల్ప గాయాలు



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు రక్షణ కల్పిస్తూ పంపిస్తున్న పోలీసులు

మొయినాబాద్: గోశాలకు కేటాయించిన ఎనికేపల్లి భూముల వద్ద సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉదయం 7.30 గంటలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్ భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్కడికి చేరుకున్నారు. గోశాల ఏర్పాటుకోసం భూమి పూజ చేశారు. అంతలోనే రైతులు అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. పరిహారం విషయం తేల్చకుండా పనులు ఎలా మొదలు పెడతారని నిలదీశారు. పరిస్థితి చేజారి పోతుందని గమనించిన పోలీసులు వలయంగా ఏర్పడి ఎమ్మెల్యేను కారులో ఎక్కించి అక్కడి నుంచి పంపించారు.

తప్పుదోవ పట్టించారు

అధికారులు, పోలీసులు తమను తప్పుదోవ పట్టించారని రైతులు ఆరోపించారు. ఉదయం 8.30 గంటలకు ఎమ్మెల్యే వచ్చి తమతో మాట్లాడతారని అధికారులు సమాచారం ఇచ్చారని, కానీ 7.30 గంటలకే వచ్చి భూమి పూజ చేశారన్నారు. గ్రామం నుంచి భూముల వద్దకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకున్నారని.. ఎమ్మెల్యే భూమి పూజ పూర్తయిన తరువాత పంపారన్నారు.

లాఠీ ఝులిపించిన పోలీసులు

ఎమ్మెల్యే యాదయ్య వెళ్లిపోయిన తరువాత రైతులు అక్కడే బైఠాయించి ఆందోళన చేశారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో భూములను చదును చేసేందుకు జేసీబీ అక్కడికి రాగా రైతులంతా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు లాఠీలు ఝులిపించారు. లాఠీ దెబ్బలకు ఓ మహిళ చెయ్యికి గాయాలుకాగా, మరొకరికి వీపులో వాతలు వచ్చాయి. రైతులు రాత్రి వరకు అక్కడే బైఠాయించారు.

ఖాళీ భూములు ఇవ్వాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసే గోశాలకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్‌రత్నం అన్నారు. ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. మండలంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయని, రైతులు సాగుచేసుకొనే భూములను తీసుకోవడం సరికాదన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిని ఈ నెల 13న కలసి మాట్లాడటానికి సమయం తీసుకున్నారని.. అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టొద్దని తహసీల్దార్ గౌతమ్ కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భీమేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి కేకలు!



మైల్వార్ ప్రాథమిక పాఠశాల

- మైల్వార్ ప్రాథమిక పాఠశాలలో అందని మధ్యాహ్న భోజనం
- ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని నిర్వాహకుల నిరసన
- పస్తులతో అవస్థలు పడిన 150 మంది చిన్నారులు

బషీరాబాద్: మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. మండల పరిధిలోని మైల్వార్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5 తరగతుల వరకు 150 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు భువనేశ్వరీ, ప్రమీళ, సంగీత వీరికి నిత్యం మిడ్ డే మీల్స్ వండిపెట్టేవారు. బిల్లులు రావడం లేదని వంట చేయలేదు. సోమవారం మధ్యాహ్నం లంచ్ బెల్ కొట్టగానే విద్యార్థులు రోజూ మాదిరిగానే ప్లేట్లు పట్టుకుని బయటకు వచ్చారు. ఈ సమయంలో.. 'బిల్లులు రావడం లేదని ఏజెన్సీ వాళ్లు వంట చేయలేదు. మీరంతా ఇళ్లకు వెళ్లి తిని రావాలి' అని ఉపాధ్యాయులు చెప్పారు. అప్పటికే ఆకలితో అలమటిస్తున్న చిన్నారులు ఇళ్లకు పరుగులు తీశారు. కొంతమంది భోజనం చేసి రాగా, ఇళ్లకు తాళాలు వేసి పొలం పనులకు వెళ్లిన వారి పిల్లలు కడుపు మంటతోనే తిరిగొచ్చారు. సాయంత్రం వరకూ ఆకలితోనే అలమటించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులను నిలదీశారు. వంట వండటం లేదని ముందే చెబితే తాము టిఫిన్లు కట్టి పంపించేవాళ్లమని హెచ్ఎం వెంకటప్పపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ విషయాన్ని తాను ఎంఈఓకు చెప్పగా ఏజెన్సీ వాళ్లకు నచ్చజెప్పాలని సూచించారని, నిర్వాహకులు మాత్రం వినలేదని తెలిపారు.



బడిలో పస్తులతో విద్యార్థులు

ఇంటికి వెళ్లి తిన్నా



ఉదయం పూట కొద్దిగా తిని రోజూ మాదిరిగానే స్కూల్‌కు వెళ్లాం. మధ్యాహ్నం లంచ్ బెల్ కొట్టగానే ప్లేట్ తీసుకొని వెళ్లాం. వంటవాళ్లు ఈ రోజు భోజనం బంద్ పెట్టారు.. మీ ఇంటికి వెళ్లి తిని రండి అని మాసార్లు చెప్పడంతో వెళ్లి తినివచ్చా.

– లావణ్య, 4వ తరగతి

తాళం వేసి ఉంది



మధ్యాహ్న భోజనం వండటం లేదని మాకు తెలియదు. లంచ్ బెల్ కాగానే బయటకు వెళ్లాం. బడిలో అన్నం వండ లేదని, ఇంటికి వెళ్లి తిని రమ్మని చెప్పారు. కానీ ఇంటికి వెళ్లే సరికి తాళం వేసి ఉంది. దీంతో తినకుండానే బడికి వచ్చేశా.

– శశాంక్, 5వ తరగతి

ఫార్మా రైతులకు ప్లాట్లు

- లాటరీ ద్వారా కేటాయింపు మరూ
- మొదటి రోజు 60 గజాల లబ్ధిదారులకు..
- ప్రక్రియను ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



లాటరీ ద్వారా రైతులకు ప్లాట్లు కేటాయిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు

కందుకూరు: వంద శాతం హక్కులతో పారదర్శకంగా ప్రభుత్వం ఫార్మా రైతులకు ప్లాట్లను అందజేస్తోందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో సోమవారం కందుకూరు, యాచారం మండలాల భూ నిర్వాసితులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. మొదటి రోజు 60 గజాల లబ్ధిదారులు 670 మందికి ప్లాట్లు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్రభుత్వమే అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేస్తుందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నామన్నారు.

రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే సబితారెడ్డి

లాటరీ ప్రారంభానికి కంటే ముందే స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. తొందరపడి ఎవరూ ప్లాట్లు విక్రయించొద్దని, భవిష్యత్‌లో మంచి లాభం వస్తుందని సూచించారు. అంతకుముందు అక్కడ జరుగుతున్న ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురించి ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు సంకల్పించిందని, దీంతో ఈ ప్రాంతం నాశనమయ్యేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతం అభివృద్ధికి కట్టుబడి ఉండేలా ఫ్యూచర్‌సిటీని ప్రకటించారన్నారు. రైతుల భూముల విలువలు మరింత పెరుగుతాయని, భవిష్యత్‌లో గజం ధర రూ.లక్ష పలుకుతుందన్నారు.

పర్యవేక్షించిన అధికారులు

మొదటి రోజు కుర్మిద్ద, మేడిపల్లి, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, నానక్‌నగర్, పంజగూడ, తాటిపర్తి రెవెన్యూ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 60 గజాల చొప్పున ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. కలెక్టర్ నారాయణరెడ్డితో పాటు ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు తదితరులు లాటరీ ప్రక్రియను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



బండపల్లి పాఠశాలలో విద్యార్థినిని పరీక్షిస్తున్న ఏంఈఓ నర్సింగ్‌రావు

తాండూరు రూరల్: పాఠశాలకు ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పెద్దేముల్ ఏంఈఓ నర్సింగ్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందజేసిన పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టాలన్నారు. వర్షాకాలం సందర్భంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సందడిగా పీర్ల ఊరేగింపు



దుద్యాల్: పీర్ల చుట్టూ ఆడుతున్న మహిళలు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్లలో మొహర్రం ఊరేగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లను 10వ రోజు గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఊదు, బెల్లం చదివింపులు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువకులు, గ్రామస్తులు ఆటపాటలతో సందడి చేశారు.

మొహర్రం ఉత్సాహం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం మొహర్రం సందడి నెలకొంది. వడిచర్ల, నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం గ్రామాల్లో పీర్లను ఊరేగించి సాయంత్రం నిమజ్జనం చేశారు. చిన్నాపెద్ద ఆడిపాడారు.

పరిగి తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్



ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనంతగిరి: అక్రమాలకు పాల్పడిన పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి అవినీతికి పాల్పడిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని ప్రశ్నించారు. విచారణ పేరుతో కాలాయాపన చేయడం తగదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బుగ్గప్ప, వెంకటయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, శ్రీనివాస్‌నాయక్, మల్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మర్పల్లి: ప్రభుత్వ వసతి గృహంలో ఉండి చదువుకునే పేద విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మర్పల్లి ఎంపీడీఓ రాజ్ మల్లయ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని పట్లూర్ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారని వార్డెన్ తుల్జారామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 30 మంది విద్యార్థులు ఉన్నారని బదులిచ్చారు. అనంతరం వసతి గృహంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అధ్వాన రోడ్డు.. అవస్థలు చూడు



గుంతలమయమైన సంగెంకలాన్ రోడ్డు

నిధులున్నా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న సంగెంకలాన్ గ్రామస్తులు
- త్వరగా పూర్తి చేయాలని బీజేపీ నేతల వినతి

తాండూరు రూరల్: గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికి రహదారులన్నీ గుంతలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రిపూట గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు మాత్రం పనులు ప్రారంభించడం లేదని తాండూరు మండలవాసులు ఆరోపిస్తున్నారు. కనీసం గుంతలను సైతం పూడ్చాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి

పెద్ద గుంతలతో ఇబ్బంది

మండలంలోని సంగెంకలాన్ గ్రామం తాండూరు పట్టణానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉంది. తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో ఉంటుంది. ప్రధానంగా గ్రామస్తులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సంగెంకలాన్ నుంచి మల్కాపూర్ మీదుగా ప్రధానరోడ్డు తాండూరు–చించోళి మార్గం ద్వారా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మల్కాపూర్ గేటు నుంచి సంగెంకలాన్ గ్రామానికి 5 కిలో మీటర్ల దూరం ఉంది. ప్రస్తుతం ఆ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వినతిపత్రం అందజేత

సంగెంకలాన్‌కు వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని ఆ గ్రామానికి చెందిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాళ్ల సంజీవ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఏఈ శ్రవణ్‌కు వినతిపత్రం అందజేశారు. గుంతలమయమైన రోడ్డుతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

“ త్వరలో పనులు ప్రారంభం

మల్కాపూర్ నుంచి సంగెంకలాన్ గ్రామానికి బీటీ రోడ్డు రెన్యూవల్‌కు ప్రభుత్వం రూ.1.72 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఎస్‌ఎస్‌ఆర్ కంపెనీ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడాను. వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తారు.

– శ్రవణ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, తాండూరు

కరెంటు సమస్య తీర్చండి



స్పీకర్‌ను కలిసి ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై వివరిస్తున్న ధారూరు రైతులు

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన రైతులు

ధారూరు: పొలాల్లో వేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తరుచూ కాలిపోవడం, కొత్తగా అమర్చిన మోటార్లు నడవకపోవడంపై ధారూరు రైతులు సోమవారం శాసనసభ స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పదేపదే చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచి, కొత్త లైన్ వేయించాలని అభ్యర్థించారు. ఒకే లైన్‌లో 25 కేవీల రెండు మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. లోడ్ అధికం కావడంతో ఇవి తరచూ పాడవుతున్నాయని తెలిపారు. ఫలితంగా పంటలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని చెప్పారు. రెండు మినీ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 63 కేవీల ఒకే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని స్పీకర్‌కు విన్నవించారు. ప్రస్తుతం వరి సాగుకు నారు పోశామని, కరెంట్ మోటార్లు సరిగా నడవక నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై స్పందించిన స్పీకర్ ట్రాన్స్‌కో ఎస్ఈకి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎక్కువ కెపాసిటీ కలిగిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కబ్జాచెరలో జుంటివాగు

- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు
- ఆందోళనలో పరిసర ప్రాంత రైతులు

బషీరాబాద్: మండలంలోని కాశింపూర్ శివారులో జుంటివాగు కబ్జాకు గురవుతోందని పలువురు రైతులు ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. పదేళ్ల క్రితం నగరానికి చెందిన ఓ కుటుంబం వాగు అంచున 17.13 ఎకరాల వ్యసాయ భూమి కొనుగోలు చేసింది. కొద్ది రోజులుగా వీరు సదరు భూమిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో తమ పొలానికి ఆనుకొని ఉన్న 200 మీటర్ల పొడవునా మట్టిపోశారు. ఈ ప్రాంతం బషీరాబాద్, యాలాల, తాండూరు మూడు మండలాలు కలిసే శివారులో ఉండటంతో అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. చెక్‌డ్యాంకు పక్కనే బఫర్ జోన్ కిందకు వచ్చే పొలంలో గదుల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం తాండూరు మండలం గోనూరు కాగ్నా నది నుంచి అనుమతులు లేకుండా రాత్రి వేళ ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ విషయమై భూ యజమానిని అడగగా తాము పదేళ్ల క్రితం పట్టా భూములను కొనుగోలు చేశామని, ఇందులో కొంత భూమి వాగులో కలిసిందని, దీన్ని సాగులోకి తెచ్చుకునేందుకు చదును చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని కొంతమంది ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు.



బఫర్ జోన్ పరిధిలో ఇంటి నిర్మాణ పనులు

“ కఠిన చర్యలు తీసుకుంటాం

జుంటివాగు శిఖం భూమి కబ్జా చేసినట్లు కొంత మంది రైతులు మా దృష్టికి తెచ్చారు. ఈ భూముల వివరాలు రెవెన్యూ శాఖ వద్ద ఉన్నాయి. వాగు రికార్డులు పరిశీలించి కబ్జా చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నేను సెలవులో ఉన్నా.. రెండు రోజుల్లో చెక్‌డ్యాం, వాగు భూమిని సర్వే చేస్తాం.

– కృష్ణయ్య, డీఈ, తాండూరు

పని గంటలు తగ్గించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ


అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 282ను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎన్టీఆర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు కార్మిక సంఘాలు జూలై 9న సార్వత్రిక సమ్మెకు సిద్ధమైతే రేవంత్‌రెడ్డి సర్కార్ జీవోలు తీసుకురావడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ అడుగుజాడల్లో నడుస్తుందా అని మండిపడ్డారు. ఓవైపు పని గంటలు తగ్గించాలని ఉద్యమిస్తుంటే పనిగంటలు పెంచడం సరైంది కాదన్నారు. కేంద్రం కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. పాశమైలారంలో జరిగిన దుర్ఘటన విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల యూనియన్ నాయకులు మంగమ్మ, ఉమాదేవి, చంద్రకళ, మాణెమ్మ, సుజాత, బుచ్చిరెడ్డి, మల్లేశం, వెంకటయ్య, పద్మమ్మ, అరుణ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తి మృతి

దౌల్తాబాద్: పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తిమ్మాయిపల్లికి చెందిన నర్సప్ప(48), భార్య లక్ష్మిపై గ్రామానికి చెందిన వైరివర్గం దాడి చేసింది. ఈ మేరకు దంపతులిద్దరూ ఘటన పై ఫిర్యాదు చేసేందుకు ఠాణాకు చేరుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసి బయట కూర్చున్నారు. ఛాతిలో నొప్పి వస్తోందని పడుకున్నాడు. భార్య ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలను పిలిచి మాట్లాడుదామనే లోపు ఈ ఘటన చోటు చేసుకుందని.. కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.



నర్సప్ప(ఫైల్)

మట్టి గణపతినే పూజిద్దాం

జిల్లా బీసీ సంక్షేమాధికారి ఉపేందర్

అనంతగిరి: కుమ్మరి కుల వృత్తుల వారిని ప్రోత్సహించడానికి, పర్యావరణాన్ని పరిక్షించడానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నిర్మూలనకు మట్టి గణపతులనే పూజించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్టి గణపతి ప్రతిమలు కావాల్సిన వారు దిగువ తెలిపిన వారిని సంప్రదించాలని ఆయన కోరారు. కొడంగల్–అంజిలయ్య (93916 45200) తాండూర్–శ్రీశైలం (96405 18846), పరిగి–శంకర్ (96760 38986) వికారాబాద్–అంజిలయ్య (99664 66982)లో సంప్రదించాలన్నారు.

పోతులవాగు కబ్జాదారులపై ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: మండల పరిధిలోని అల్లాపూర్ సమీపంలోని పోతులవాగును కబ్జా చేసిన వ్యక్తులపై ఇరిగేషన్ ఏఈ నీరజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్నది కొంతే.. కొల్లగొట్టింది ఎంతో అనే శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించారు. వికారాబాద్ ఇరిగేషన్ డీఈ రవికుమార్‌తో కలిసి కబ్జాదారులైన జయలింగారెడ్డి, రసూల్‌ఖాన్‌లపై తగిన చర్య తీసుకోవాలని ఆమె ఎస్ఐ అనితను కోరింది. పోతులవాగును కబ్జాచేసి మట్టి పోసి రాళ్లతో గోడ నిర్మించి ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి వాస్తవం మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా పోతులవాగును అరకిలోమీటర్ మేరకు కబ్జా చేసి తమ పొలంలోకి కలుపుకొన్నారని రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశం మేరకు నీటిపారుదలశాఖ అధికారులు పోతులవాగును, కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డును దున్నేసి కబ్జా చేసింది వాస్తవమని వారి పరిశీలనలో తేల్చారు. ప్రాథమిక విచారణ మేరకు ఇద్దరు వ్యక్తులు వాగును, కాల్వ రోడ్డును ఆక్రమించినట్లు గుర్తించారు.

పుస్తక విజ్ఞానం.. మరింత విస్తృతం

- త్వరలో మరిన్ని పబ్లిక్ రీడింగ్ రూమ్స్
- గ్రంథాలయాల పునఃప్రారంభానికి కసరత్తు

బొంరాస్‌పేట: ‘పుస్తకం హస్త భూషణం’ అన్నారు విద్యావంతులైన పెద్దలు. ప్రచార, ప్రసార మాధ్యమాలు లేని కాలంలో పరిజ్ఞానాన్ని పంచిన పుస్తక ప్రపంచం మరుగున పడబోతోంది. దాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా గ్రంథాలయ సంస్థ తిరిగి లైబ్రరీలను బలోపేతం చేయడం, పునఃప్రారంభించడం, ప్రజాపఠనాలయాలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టబోతోంది. జిల్లా వ్యాప్తంగా త్వరలో పుస్తక విజ్ఞానాన్ని విస్తృతం చేయబోతోంది.

గ్రామీణ గ్రంథాలయాలివే..

జిల్లా వ్యాప్తంగా పుట్టపహాడ్, మరికల్, నవాబుపేటలో గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి నిర్వహణ సంపూర్ణంగా జరగడానికి కృషిచేపట్టనున్నారు. పౌర పఠన మందిరాల నిర్వహణకు ప్రతి నెలా దిన పత్రికలకు వెయ్యిరూపాయలు, నిర్వాహకుడికి గౌరవవేతనంగా వెయ్యి రూపాయ లు పంచాయతీల ద్వారా అందజేస్తున్నారు.

మంజూరుకు సిద్ధంగా

మండల పరిధిలోని రేగడిమైలారం, కొడంగల్ మండలం రుద్రారంలో విద్యావంతులు ఎక్కువ ఉన్న గ్రామాల్లో త్వరలో పబ్లిక్ రీడింగ్ రూమ్స్ ప్రారంభించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ నిర్వాహకులు 37 పోస్టులకుగానూ 10మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు.

నిర్వహణలోని ప్రజా పఠనాలయాలు

దాదాపూర్, పీరంపల్లి, బార్వాడ్, కరన్‌కోట్, నవల్గా, నారాయణ్‌పూర్ గ్రామాల్లోని ప్రజా పఠనాలయాలు నిర్వహణలో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న లైబ్రరీలను జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, కార్యదర్శి సురేశ్‌బాబు పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన వాటిని పునఃప్రారంభించేందుకు కృషిచేస్తున్నామని చెబుతున్నారు. నవంబరు 14 నుంచి 20వరకు ఏటా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి సాధారణంగా రోజువారీగా 250 మంది పాఠకులు వస్తున్నారు. పరిగిలో 70మంది, తాండూరులో 100, కొడంగల్ 40మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా నిత్యం పెద్ద సంఖ్యలో పాఠకులు గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారు.



దౌల్తాబాద్ గ్రంథాలయం

లైబ్రరీల వివరాలు

జిల్లాలో గ్రంథాలయాలు	17
గ్రామీణ గ్రంథాలయాలు	3
పౌర పఠన మందిరాలు	6
నిర్వహణలోని పబ్లిక్ రీడింగ్ రూమ్స్	8
గ్రంథాలయ పరిపాలకులు మొత్తం	37
ప్రభుత్వ నిర్వాహకులు	10
పునఃప్రారంభమైనవి	6

జిల్లా వ్యాప్తంగా ఉన్న పుస్తకాలు 3లక్షలు

“ మరో వారంలో ప్రారంభిస్తాం



జిల్లా అక్షరాస్యులకు పఠనాసక్తిని పెంచాలని ప్రత్యేక కృషి చేస్తున్నాం. బసవాపూర్, రుద్రారం, రేగడిమైలారం, చౌడాపూర్, ముజాహిద్‌పూర్‌కు త్వరలోనే పబ్లిక్ రీడింగ్ రూమ్స్ మంజూరు కానున్నాయి. జీపీల పర్యవేక్షణలో కొనసాగే వీటి నిర్వహణకు రూ.2 వేలు ఖర్చు చేస్తారు. స్వయం సహాయక సంఘాల స్వచ్ఛందంగా ఆసక్తి చూపితే రూ.5 వేల వరకు అందించే అవకాశం ఉంది.

– శేరి రాజేశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వికారాబాద్

తప్పుల్లేకుండా ఓటరు జాబితా



బూత్ లెవెల్ అధికారుల శిక్షణలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బూత్ లెవెల్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామ ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఇందుకుగాను ఏదైనా సలహాలు, సూచనలు అవసరమైతే వెంటనే మండల స్థాయి అధికారులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటస్వామి, డీటీ కిరణ్‌కుమార్, ఆర్ఐలు వేణు, శివచరణ్, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు

అనంతగిరి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రాజు, అక్బర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నెలలుగా ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించడం తగదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు తేజ, జిల్లా నాయకులు పవన్, అభిషేక్, సిద్ధార్థ, కార్తీక్, బద్రీనాథ్, ఫైజల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

సర్కార్ బడుల బలోపేతానికి కృషి



లైబ్రరీకి పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంకల్ ప్రభుత్వ పాఠశాలకు జిల్లా అధికార ప్రతినిధి కొండాల రవీందర్ రూ.30 వేలు వెచ్చించి సీసీ కెమెరాలను అందజేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. ఉన్న ఊరుకు, చదువుకున్న పాఠశాలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరప్ప 200 రకాల పుస్తకాలను లైబ్రరీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలం, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణాచారి, నాయకులు మాణిక్యం, రవి, నర్సింలు, నవీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

చండీయాగాన్ని జయప్రదం చేయండి

డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థ చారి

పరిగి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నగరంలోని తుల్జాభావన్ ధర్మశాలలో నిర్వహించనున్న పంచకుండాత్మక చండీయాగం, కుబేరపాశుపత యాగాలను జయప్రదం చేయాలని దూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జిల్లా డీడీఎన్ఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14, 15, 16 తేదీల్లో డీడీఎన్ఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్చకులు నియమనిబంధనలు పాటిస్తూ దేవాలయాల్లో దూప దీప నైవేద్యాలను సమర్పిస్తూ ప్రజలకు తీర్థప్రసాదాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, సభ్యులు శివానందం, అఖిలేష్, నటరాజేశ్వర్, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయతీర్థ చారి

మహిళ అదృశ్యం

పరిగి: మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని చిట్యాలలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది శశికళ, యాదయ్య దంపతులకు ఇద్దరు సంతానం. యాదయ్య ఎలికట్ట పెట్రోల్ బంక్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజుమాదిరిగానే ఆయన ఈ నెల 5న విధులకు వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూడగా భార్య కనపడలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శశికళ (ఫైల్)